సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం | 27 | ఏప్రిల్ | 2023



నేటి నుంచి నాటిక పోటీలు
భీమవరం చైతన్యభారతి సంగీత నృత్య, నాటక పరిషత్ ఆధ్వర్యంలో నేటి నుంచి జాతీయ స్థాయి నాటిక పోటీలు ప్రారంభం కానున్నాయి. 8లో



దోమల రహితంగా గూడెం
దోమలు లేని తాడేపల్లిగూడెం తన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి, కొట్టు సత్యనారాయణ అన్నారు. కడకట్ల శివారున ఎస్టీపీ ప్లాంట్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. 8లో



పెళ్లికి నిరాకరించాడని..
ప్రేమించానని నమ్మించి మోసగించి పెళ్లికి నిరాకరించడంతో ఇరగవరం మండలం అయితంపూడిలో ఓ నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. 8లో

ఏలూరు మెడికల్ కాలేజీ సిద్ధం

- 2023-24 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం
- 150 ఎంబీబీఎస్ సీట్లు మంజూరు చేసిన నేషనల్ మెడికల్ కమిషన్



తుది దశలో ఏలూరు మెడికల్ కళాశాల నిర్మాణ పనులు

సాక్షి ప్రతినిధి, ఏలూరు : ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభానికి సిద్ధమైంది. అధికారికంగా నేషనల్ మెడికల్ కమిషన్ 2023-24 విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించడానికి అనుమతి మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సుదీర్ఘ కలగా ఉన్న ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల కొద్ది నెలల్లో సాకారం కానుంది. లక్ష అడుగుల విస్తీర్ణంలో ప్రభుత్వ కళాశాల ప్రారంభం కానుంది. మరోవైపు కళాశాల నిర్మాణ పనులు తుది దశలో ఉన్నాయి.

తుది దశలో నిర్మాణ పనులు

ఏలూరు నగరంలోని డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం ప్రాంగణంలో 1.92 ఎకరాల్లో రూ. 38 కోట్ల ప్రాథమిక వ్యయంతో లక్ష చదరపు అడుగుల భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. నేషనల్ మెడికల్ కమిషన్ పరిధిలోని మెడికల్ అసెస్‌మెంట్ రేటింగ్ బోర్డు ఈ ఏడాది జనవరిలో ఏలూరులో పర్యటించి కమిషన్‌కు ఫిబ్రవరిలో నివేదిక అందచేసింది. దానిపై అన్ని అంశాలు క్షుణ్ణంగా పరిశీలించి బుధవారం 150 మెడికల్ సీట్లు కేటాయించి, 2023-24 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించాలని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీకి సూచించింది. రేటింగ్ బృందం నిర్మాణ పురోగతిలో ఉన్న ప్రాంగణాన్ని పరిశీలించి కళాశాల గదులు, లేబరేటరీ, లైబ్రరీ, హాస్టల్స్, హాస్పటల్స్, రెసిడెంట్, ట్యూటర్, నర్సింగ్, పారా మెడికల్ సిబ్బంది క్వార్టర్స్‌ను అన్నింటిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేయడంతో నేషనల్ మెడికల్ కమిషన్ విద్యా సంవత్సరం ప్రారంభానికి అనుమతి మంజూరు చేసింది. మరోవైపు నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఇప్పటికే భవన నిర్మాణ పనులు పూర్తయి మిగిలిన పనులు సాగుతున్నాయి.

సమగ్ర ప్రాజెక్టుకు రూ.525 కోట్లు

ఏలూరు ప్రభుత్వ వైద్యకళాశాల నిర్మాణం, టీచింగ్ హస్పటల్ సమగ్ర అభివృద్ధికి రూ. 525 కోట్లు మంజూరు చేశారు. ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించడం కోసం యుద్ధప్రాతిపదికన రూ.38 కోట్లతో లక్ష చదరపు అడుగుల భవనాన్ని నిర్మించారు. మొత్తం 33.12 ఎకరాల్లో రూ.525 కోట్లతో 13.21 లక్షల చదరపు అడుగుల్లో ఏర్పాటు చేయాలని డీపీఆర్ సిద్ధం చేసి అనుమతులు పొందారు. లక్ష చదరపు అడుగుల్లో జీప్లస్-4 భవనాన్ని నిర్మించారు. దీనిలో ఈ ఏడాది ఆగస్టు నుంచి నూతన విద్యా సంవత్సరంలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం 150 సీట్లతో ప్రారంభం కానుంది. లక్ష చదరపు అడుగుల భవన సముదాయంలో 8 తరగతి గదులు, 8 ల్యాబ్‌లు, 4 లెక్చర్ థియేటర్స్, 3 మ్యూజియమ్స్, 250 మంది కూర్చొనే విధంగా మల్టీపర్పస్ హాల్, లైబ్రరీ, స్కిల్ ల్యాబ్, మరో ల్యాబ్‌ను జీ ప్లస్-4 భవనంలో నిర్మించారు. అలాగే 60 మంది విద్యార్థులతో జీప్లస్-2 భవనాన్ని, నర్సింగ్ కళాశాల నిర్మిస్తున్నారు. విద్యార్థులకు, వైద్యులకు, స్టాఫ్ నర్సులకు, నర్సింగ్ విద్యార్థులకు కలిపి మరో రెండు భారీ భవనాలు నిర్మిస్తున్నారు.

వైభవంగా వాసవీ మాత జయంతి



పెనుగొండ: ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా ప్రారంభించినట్లు శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కోట్ల రామకృష్ణ మోహనరావు అన్నారు. ఆయన మాట్లాడుతూ సుప్రభాతం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, మహాసంకల్పం, రుత్విక్వరుణలు, నగరేశ్వర స్వామికి అభిషేకం, మహిషాసురమర్ధనీ, వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవార్లకు కుంకుమార్చనలతో ఉత్సవాలు ప్రారంభమైనట్లు తెలిపారు. 27న అభిషేకం, కుంకుమార్చనలు 28న లక్ష కుంకుమార్చన, 29న నగరేశ్వర స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవార్లకు కుంకుమ పూజలు, 102 కన్యల పూజ 30న శ్రీ వాసవీ జయంతి నిర్వహిస్తామన్నారు. మే 1న వెంకటేశ్వర స్వామి ఉపాలయం వద్ద అలివేలు మంగా, పద్మావతి, సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తామన్నారు.

న్యూస్‌రీల్

చినవెంకన్న బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఈఓ త్రినాథరావు

ద్వారకాతిరుమల: చినవెంకన్న వైశాఖ మాస దివ్య బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం పలుకుతూ రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావుకు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు బుధవారం ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఎమ్మెల్యే తలారిని దేవరపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో, మంత్రి కొట్టును తాడేపల్లి గూడెంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలసిన ఈఓ ముందుగా వారికి శ్రీవారి శేషవస్త్రాలను కప్పి, బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. ఈ నెల 30 నుంచి వచ్చే నెల 7 వరకు జరగనున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మే 4న రాత్రి శ్రీవారి తిరుకల్యాణం, 5న రాత్రి రథోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి.

17 శాతం తేమ ఉంటేనే మిల్లుకు తరలించాలి



అత్తిలిలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి టి.శివరామప్రసాద్

అత్తిలి: కోసిన వెంటనే తేమ శాతాన్ని పరీక్షించి 17 శాతం ఉన్నప్పుడే మిల్లులకు పంపించాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి టి.శివరామ ప్రసాద్ రైతులకు సూచించారు. బుధవారం ఆయన తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్‌తో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా శివరామప్రసాద్ మాట్లాడుతూ ధాన్యాన్ని ఎక్కువగా ఎండబెట్టడం వల్ల నూక శాతం పెరుగుతుందని, రైతులందరూ పంటకోసిన వెంటనే తేమశాతం రైతు భరోసా కేంద్రాల్లో పరిశీలించుకుని వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. అత్తిలి, బల్లిపాడు గ్రామాల్లో గల రైతు భరోసా కేంద్రాలను, శ్రీవెంకటేశ్వర రైస్ మిల్లును సందర్శించారు.

టెన్త్ పబ్లిక్ పరీక్షల మూల్యాంకనం పూర్తి

సాక్షి, భీమవరం: టెన్త్ పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం బుధవారంతో పూర్తయినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. వీరవాసరం మద్దాల రామకృష్ణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1,66,340 జవాబు పత్రాల మూల్యాంకనంలో 856 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మూల్యాంకనం ప్రశాంతంగా ముగిసిందని దీనికి సహకరించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యాహక్కు చట్టంలో ప్రవేశాలకు గడువు పొడిగింపు

సాక్షి, భీమవరం: విద్యాహక్కు చట్టం ద్వారా జిల్లాలో ప్రవేటు పాఠశాలల్లో ప్రవేశం పొందిన విద్యార్థులు ఈ నెల 27లోపు ఆయా స్కూళ్లలో జాయిన్ అవ్వాలని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాహక్కు చట్టంలో జిల్లాలో 156 మంది విద్యార్థులు ఎంపికకాగా ప్రవేశానికి గతంలో ఈనెల 25 వరకూ గడువు ఇవ్వగా దానిని 27కి పొడిగించినట్లు ఆయన పేర్కొన్నారు.

పలువురు డీఎస్పీలకు బదిలీ



ధనుంజయుడు, డీఎస్పీ

ఏలూరు టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన డీఎస్పీల బదిలీల్లో జిల్లాలో పలువురు డీఎస్పీలకు స్థానచలనం కలిగింది. ఉమ్మడి జిల్లా దిశ డీఎస్పీగా పనిచేస్తున్న కేవీ సత్యనారాయణను పరవాడకు బదిలీ చేశారు. అదే విధంగా జంగారెడ్డిగూడెం డీఎస్పీ పోస్టుకు దిశ డీఎస్పీ సత్యనారాయణ ఇంతవరకు ఇన్‌చార్జి డీఎస్పీగా బాధ్యతలు నిర్వర్తించారు. జంగారెడ్డిగూడెం డీఎస్పీగా ధనుంజయుడిని నియమించారు. పోలవరం డీఎస్పీగా పనిచేసిన లతాకుమారిని పెద్దాపురానికి బదిలీ చేశారు. విజయవాడ వెస్ట్ ఏసీపీ హనుమంతరావు పోలవరం డీఎస్పీగా రానున్నారు.

ఇంటర్‌లో 77 శాతం ఉత్తీర్ణత

- సెకండియర్ ఫలితాల్లో ఉమ్మడి పశ్చిమకు తృతీయ స్థానం
- ప్రథమ సంవత్సరంలో 70 శాతం ఉత్తీర్ణత
- సత్తా చాటిన బాలురు



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా విద్యార్థులు సత్తాచాటారు. ఈ ఏడాది సెకండియర్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించి జిల్లాను రాష్ట్రంలో 3వ స్థానంలో నిలిపారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా మొత్తం 27,691 మంది సెకండియర్ పరీక్షలు రాయగా 77 శాతంతో 21,359 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 12,007 మంది బాలికలు పరీక్ష రాయగా 73 శాతంతో 8,777 మంది ఉత్తీర్ణులయ్యారు. 15,684 మంది బాలురు పరీక్ష రాయగా 80 శాతంతో 12,582 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ ఏడాది బాలికలను వెనక్కి నెట్టి బాలురు ఎక్కువ శాతం ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరం 29,110 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 70 శాతంతో 20,237 మంది ఉత్తీర్ణులై జిల్లాను రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిపారు. వీరిలో 16,069 మంది బాలికలకు 73 శాతంతో 11,673 మంది, 13,041 మంది బాలురకు 66 శాతంతో 8,564 మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ ఇంటర్మీడియట్‌లో ద్వితీయ సంవత్సరంలో జిల్లా రాష్ట్రంలో ద్వితీయ స్థానం, ప్రథమ సంవత్సరంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ సంవత్సరంలో మొత్తం 3,002 మంది పరీక్షలు రాయగా 2,106 మంది ఉత్తీర్ణులు కాగా ప్రథమ సంవత్సరంలో 3,340 మంది పరీక్షలు రాయగా 2,078 మంది ఉత్తీర్ణులయ్యారు.

రెండు స్థానాలు ఎగబాకిన జిల్లా

గత మార్చి నెల 15 నుంచి ఈ నెల 4 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించారు. జవాబు పత్రాల మూల్యాంకనం ఈ నెల 1 నుంచి ప్రారంభించి 18తో ముగించారు. 2020వ సంవత్సరంలో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన జిల్లా 2021-22 విద్యా సంవత్సరం ఫలితాల్లో మూడు స్థానాలు పడి 5వ స్థానంతో సరిపెట్టుకుంది. 2022-23 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు బోధనాంశాల్లో చేపట్టిన సంస్కరణల కారణంగా ఈ సారి రెండు స్థానాలు ఎగబాకింది.

ఐదేళ్లుగా జిల్లా ఫలితాల సరళి

2018లో రాష్ట్ర స్థాయిలో 5వ స్థానం సాధించిన జిల్లా 2019లో 3వ స్థానానికి, 2020లో ద్వితీయ స్థానానికి చేరుకుంది. 2022లో 5వ స్థానం సాధించగా కోవిడ్ కారణంగా 2021లో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు నిర్వహించకుండా మొత్తం విద్యార్థులను ఉత్తీర్ణులుగా ప్రకటించారు. ప్రథమ సంవత్సరం విద్యార్థుల ఫలితాల్లో 2018, 19, 20 సంవత్సరాల్లో రాష్ట్ర స్థాయిలో జిల్లా ద్వితీయ స్థానంలో నిలువగా 2022లో 5వ స్థానానికి పడిపోయింది.


రీ వాల్యుయేషన్ దరఖాస్తుకు 6 వరకూ గడువు

ఇంటర్మీడియట్ పేపర్ల రీ కౌంటింగ్, రీ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు ఈ నెల 27 నుంచి మే నెల 6 వరకూ గడువు ఉందని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కే.చంద్రశేఖర బాబు తెలిపారు. థియరీ సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుంచి జూన్ 1 వరకూ, సప్లిమెంటరీ ప్రయోగ పరీక్షలు జూన్ 5 నుంచి 9 వరకూ జరుగుతాయన్నారు. పరీక్ష ఫీజులను ఈ నెల 27 నుంచి మే 3 వరకూ చెల్లించవచ్చని తెలిపారు.

కొత్త జిల్లాల వారీగా ఫలితాలు

కొత్త జిల్లాల వారీగా ఫలితాలు పరిశీలిస్తే సెకండియర్‌లో ఏలూరు జిల్లా నుంచి 10,392 మంది జనరల్ విద్యార్థులు పరీక్షలు రాయగా 7,570 మంది, 1537 మంది ఒకేషనల్ విద్యార్థులకు 888 మంది ఉత్తీర్ణులయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లా నుంచి 14,330 మంది జనరల్ విద్యార్థులకు 10246 మంది, 1484 మంది ఒకేషనల్ విద్యార్థులకు 847 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరం ఏలూరు జిల్లా నుంచి 10,748 మంది జనరల్ విద్యార్థులకు 7,472 మంది, 1,826 మంది ఒకేషనల్ విద్యార్థులకు 959 మంది ఉత్తీర్ణులయ్యారు. పశ్చిమ గోదావరి నుంచి 14,429 మంది జనరల్ విద్యార్థులకు 9,629 మంది, 1552 మంది ఒకేషనల్ విద్యార్థులకు 759 మంది ఉత్తీర్ణులయ్యారు.

అమూల్ పాల సేకరణ పెంచాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): అమూల్ పాల సేకరణ పెంపుదలకు అధికారులు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. భీమవరంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ పి.ప్రశాంతి గ్రామీణ అభివృద్ధి, పశు సంవర్ధక శాఖల అధికారులతో బుధవారం సమావేశమై అమూల్ పాల సేకరణ, చేయూతలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాల సేకరణ చాలా తక్కువగా ఉందని, సంబంధిత అధికారులు శ్రద్ధ చూపడం లేదన్నారు. యలమంచిలి, తాడేపల్లిగూడెం, నరసాపురం, పాలకొల్లు మండలాల్లోని చాలా గ్రామాల్లో పాల సేకరణ తక్కువగా ఉండటంపై సంబంధిత అధికారులను గట్టిగా ప్రశ్నించారు. పాడి రైతులతో సమావేశమై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. వచ్చే వారం సమీక్ష నాటికి ఎట్టి పరిస్థితుల్లో పాల సేకరణలో పెరుగుదల కనిపించాలన్నారు. చేయూత పథకం ద్వారా కొనుగోలు చేసిన పాడిపశువులకు సంబంధించిన పాలు నూరు శాతం అమూల్‌కి కచ్చితంగా అందజేయాలన్నారు. ఇతర పాడి రైతుల నుంచి కూడా కనీసం ఒక లీటర్ అమూల్‌కు ఇచ్చేలా ప్రోత్సహించాలన్నారు. పశువుల అంబులెన్స్‌లు విస్తృత సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పశువులకు సాధారణ చికిత్సలు చేయడంతో పాటు, అవసరమైన వాటిని పశువైద్యశాలకు తరలించి వైద్యం అందించాలన్నారు. చేయూత పథకం ద్వారా కొనుగోలు చేసిన పశువులు క్షేత్రస్థాయిలో ఉన్నాయో లేదో పరిశీలించి నివేదికను అందచేయాలన్నారు. చేయూత పథకం ద్వారా 19 మండలాల్లో 8,318 పాడి పశువులు అందించడం లక్ష్యం కాగా, ఇంతవరకు వాస్తవంగా ఎన్ని పశువులను అందజేశారు.. ఇంకా ఎన్ని కొనుగోలు చేయాలనే వివరాలను రానున్న 15 రోజుల్లో అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె.మురళి కృష్ణ, డీఆర్డీఏ ఏపీఓలు, ఏపీఎంలు, పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు పాల్గొన్నారు.

మానవ వనరులు వినియోగించుకోవాలి

మానవ వనరులను సక్రమంగా వినియోగించుకున్నపుడే మంచి ఫలితాలు సాధించగలమని కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. కలెక్టరు కార్యాలయంలోని స్పందన సమావేశ మందిరంలో జిల్లా, మండల అధికారులతో వివిధ అంశాలపై కలెక్టరు బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు ఉన్న వారందరికీ 50 నుంచి 60 రోజులు పనిదినాలు కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో గృహాలు నిర్మాణం చేసేందుకు లేఅవుట్‌లలో మౌలిక సదుపాయాలు, రోడ్లు ఏర్పాటు చేయాలని చెప్పారు.

2024 ఎన్నికల్లో టీడీపీకి సున్నా

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, చిత్రంలో ఎమ్మెల్యే ఎలీజా

జంగారెడ్డిగూడెం రూరల్: గత ఎన్నికల్లో 23 స్థానాలకు పరిమితమైన తెలుగుదేశం పార్టీ 2024 అసెంబ్లీ ఎన్నికల్లో జీరోకి పరిమితం కాబోతుందని, 175 స్థానాల్లో వైసీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రజలు పట్టం కట్టంబోతున్నారని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వంలో శ్రీనివాసపురంలో రూ.5 కోట్ల అభివృద్ధి కూడా జరగలేదని, ప్రస్తుత ప్రభుత్వంలో రూ.20 కోట్లకు పైగా అభివృద్ధి జరిగిందన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో దోచుకోవడం, పేదల సొమ్ము తినేయడమే పనిగా పెట్టుకున్నారని, ఏనాడు అభివృద్ధి చేసిన దాఖలాలు లేవన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. జాతీయ మీడియా సర్వేల్లో 24 నుంచి 25 ఎంపీ సీట్లు వైఎస్సార్‌సీపీకే వస్తాయని చెపితే.. ఒక ఎంపీకి రూ.కోటి ఇచ్చి సర్వే చేయించుకున్నారని చంద్రబాబు మాట్లాడుతున్నారని, బీజేపీకి 300 సీట్లు వస్తాయని చెప్పారని, అయితే రూ.300 కోట్లు ఇచ్చి మోదీ సర్వే చేయించుకున్నారా? అని ప్రశ్నించారు. ఇలా అన్ని రాష్ట్రాల్లో కోట్లు ఇచ్చి సర్వేలు చేయించుకున్నారా! చంద్రబాబు నాయుడుకి చిన్న మెదడు చితికిపోయి, మైండ్ పోయి లేనిపోని మాటలు మాట్లాడుతున్నారన్నారు. చంద్రబాబు నాయుడు రాజకీయ జీవితం శాశ్వతంగా సమాధి అయిపోతుందనే ఆవేదనతో మాట్లాడుతున్నారన్నారు. ఒకసారి బీజేపీతో జతకట్టడం, విడిపోవడం, మళ్లీ కలుస్తున్నామని మాట్లాడటం ఇలా చంద్రబాబు నాయుడు అపరిచితుడిలా వ్యవహరిస్తున్నారన్నారు.

ధాన్యం నూకపై పరిష్కారం చూపుతాం

రాష్ట్రంలో మెడికల్ కళాశాలల ఏర్పాటు, గ్రామానికో ఒక ఆస్పత్రి ఏర్పాటు, ప్రతీ ఇంటికి ఫ్యామిలీ డాక్టర్ కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా ప్రభుత్వం పనిచేస్తుంటే కోడి పందేలు ఆడుతూ, కోడి కత్తులు కట్టే రౌడీ షీటర్ చింతమనేని విషం కక్కే మాటలు మాట్లాడుతున్నారన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, గతంలో వచ్చిన రూ.1530 ఈ ఏడాది కూడా అందించేలా చూస్తామన్నారు. ధాన్యం నూక అవుతుందనే ఆందోళనలో రైతులు ఉన్నారనే విషయం తమ దృష్టికి వచ్చిందని ఈ విషయంపై ఏమి చేయాలి అనే దానిపై రైస్‌మిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా మాట్లాడుతూ జగనన్నే మా నమ్మకం కార్యక్రమంలో కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ప్రతి ఇంటికి వెళ్లి చేస్తున్న ప్రజాభిప్రాయ సేకరణలో ప్రభుత్వానికి ఎంతో ఆదరణ వస్తుందన్నారు. సంక్షేమం, అభివృద్ధి చూసి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బెంబేలెత్తిపోతూ నోటికొచ్చినట్లు విమర్శలు చేస్తున్నారన్నారు. తెలుగుదేశం పార్టీకి రోజు రోజుకు ప్రజాదరణ తగ్గిపోవడంతో చంద్రబాబు నాయుడు, ఆయన కుమారుడు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. నూటికి 83 శాతం మందికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, ఇందులో సింహ భాగం ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జగనన్న వసతి దీవెన నిధులు విడుదల

తల్లుల ఖాతాల్లో రూ.31.69 కోట్ల జమ



భీమవరంలో జగనన్న వసతి దీవెన చెక్కును విద్యార్థులకు అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

సాక్షి, భీమవరం : విద్యకు రాష్ట్రప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని దీనిలో భాగంగానే జగనన్న వసతి దీవెనతో విద్యార్థులకు అండగా నిలుస్తుందని కలెక్టరు పి.ప్రశాంతి చెప్పారు. బుధవారం కలెక్టరు కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్లో విద్యార్థులకు జగనన్న వసతి దీవెన చెక్కును అందచేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లాలో డిగ్రీ నుంచి పీజీ, ఇంజనీరింగ్, మెడికల్ వంటి కోర్సులు చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ విద్యార్థులకు 2022-23 విద్యా సంవత్సరంలో మొదటి విడతగా 33,231 మంది విద్యార్థులకు సంబంధించి 29,683 మంది తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.31.69 కోట్ల నిధులు జమచేసినట్లు చెప్పారు. జిల్లాలో 5,496 మంది ఎస్సీ విద్యార్థులకు రూ. 5.15 కోట్లు, 175 మంది ఎస్టీ విద్యార్థులకు రూ.16 లక్షలు, 15,362 మంది బీసీ విద్యార్థులకు రూ.14.61 కోట్లు, 3,179 మంది ఈబీసీ విద్యార్థులకు రూ.3.08 కోట్లు, 7,995 మంది కాపు విద్యార్థులకు రూ.7.69 కోట్లు, 351 ముస్లిం మైనారిటీ విద్యార్థులకు రూ.33 లక్షలు, 672 మంది క్రిస్టియన్ మైనారిటీ విద్యార్థులకు రూ.64 లక్షలు అందజేసినట్లు వివరించారు. ఆచంట నియోజకవర్గంలో 4,837 మందికి రూ.4.61 కోట్లు, భీమవరంలో 5,107 మందికి రూ.4.89 కోట్లు, నరసాపురంలో 3,949 మందికి రూ 3.79 కోట్లు, పాలకొల్లులో 3,979 మందికి రూ 3.76 కోట్లు, తాడేపల్లిగూడెంలో 4,999 మందికి రూ 4.76 కోట్లు, తణుకులో 5,681 మందికి రూ.5.38 కోట్లు, ఉండి నియోజకవర్గంలో 4,719 మంది విద్యార్థులకు రూ.4.48 కోట్లు జమకానున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి కె.శోభారాణి, వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి గణపతి రావు, గిరిజన సంక్షేమ శాఖాధికారిణి డి.పుష్పరాణి తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ దాడులు

సబ్ రిజిస్ట్రార్ వద్ద రూ.50 వేల అనధికార నగదు స్వాధీనం



నరసాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు

నరసాపురం: ఎంతోకాలంగా అనేక ఆరోపణలు, విమర్శలు ఎదుర్కొంటున్న నరసాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ వ్యవహారాలపై ఏసీబీ అధికారులు దృష్టిపెట్టారు. ఏసీబీ డీఎస్పీ టీఎస్‌ఆర్‌కే ప్రసాద్(ఏలూరు) ఆధ్వర్యంలో బుధవారం ఆకస్మికంగా దాడి చేశారు. సబ్ రిజిస్ట్రార్ వీరభద్రరావు వద్ద అనధికారకంగా ఉన్న రూ 50 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. సాయంత్రం 6 గంటల సమయంలో డీఎస్పీ ప్రసాద్‌తో పాటుగా ఏసీబీ సీఐలు భాస్కరరావు, ఏసు బాబు, నాగేంద్ర బాబు, శ్రీనివాస్‌లు ఒక్కసారిగా దాడి చేశారు. ఆ సమయంలో కార్యాలయం దస్తావేజుల లేఖర్ల కోలాహలంగా ఉంది. ఏసీబీ అధికారులు సబ్ రిజిస్ట్రార్ వద్ద ఉన్న నగదును స్వాధీనం చేసుకుని కార్యాలయంలో సోదాలు నిర్వహించారు. రికార్డులు పరిశీలించి ఎన్ని డాక్యుమెంట్లు జరిగాయి, సబ్ రిజిస్ట్రార్ వద్ద అంత మొత్తంలో నగదు ఎందుకు ఉంది, జరిగిన డాక్యుమెంట్లలో అవకతవకలు ఉన్నాయా? అన్న అంశాలను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ ప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ డీజీ ఆదేశాల మేరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై నిఘా పెట్టామన్నారు. నరసాపురం కార్యాలయంలో తమకు యాప్‌ద్వారా, నేరుగా ఫోన్ ద్వారా అనేక ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. రూ 50 వేలు అధికారి వద్ద ఉండటం నేరమన్నారు. ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చి శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యాలయంలో గతకొంత కాలంగా జరిగిన డాక్యుమెంట్లపై కూడా ఫిర్యాదులు ఉన్నాయని చెప్పారు.

పరుగులు పెట్టిన లేఖర్లు

ఏసీబీ దాడులతో దస్తావేజుల లేఖర్లు పరుగులు పెట్టారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం చెంతనే ఉన్న తమ షాపులకు తాళాలు వేసి పరారయ్యారు. ఏసీబీ అధికారులు వచ్చిన సమయంలో నిబంధనలకు విరుద్ధంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనే ఉన్న లేఖర్ల వివరాలు ఏసీబీ అధికారులు తీసుకున్నారు. ఇటీవల నిషేధిత భూముల రిజిస్ట్రేషన్ల వ్యవహారంలో మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ సస్పెండ్ అయ్యారు. నరసాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం కేంద్రంగా కొన్ని నెలలుగా కొంతమంది దస్తావేజుల లేఖర్ల ప్రోద్బలంతో అక్రమ రిజిస్ట్రేషన్‌లు జోరుగా సాగుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఒక్క కార్యాలయంలోనే లంచాల రూపంలో రోజుకు రూ.10 లక్షలు వరకూ చేతులు మారుతున్నాయని, ఈ అక్రమ తంతుకు కొందరు దస్తావేజుల లేఖర్ల కొమ్ముకాస్తున్నట్టు సమాచారం.

క్లుప్తంగా

నేరాల నియంత్రణపై మరింత దృష్టి పెట్టండి



ముదినేపల్లి పోలీసుస్టేషన్‌లో మాట్లాడుతున్న ఎస్పీ మేరీప్రశాంతి

ముదినేపల్లి రూరల్: స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణపై దృష్టి పెట్టాలని జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆదేశించారు. ముదినేపల్లి పోలీసుస్టేషన్‌ను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ వైవీఎల్ నాయుడు, ఎస్సై షణ్ముఖసాయి, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. జిల్లాలో ఉత్తమ పనితీరును కనబరుస్తున్న పోలీసుస్టేషన్లో ముదినేపల్లి స్టేషన్ ఒకటి కావడం అభినందనీయమన్నారు. ఇదేవిధంగా పనితీరును కొనసాగిస్తూ నేరాలు మరింత తగ్గేందుకు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా వ్యవహరిస్తూ ఎలాంటి ఒత్తిడిలకు తలొగ్గకుండా విధులు నిర్వహించి పోలీసుశాఖకు మంచిపేరు తీసుకురావాలన్నారు. స్టేషన్ పనితీరుకు సంబంధించిన వివరాలను ఎస్సై షణ్ముఖసాయి ఎస్పీకి వివరించారు. రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.

విద్యార్థులపై తేనెటీగల దాడి

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి): జీలుగుమిల్లిలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం ఉదయం పరీక్ష రాసేందుకు వెళ్లిన విద్యార్థులపై తేనెటీగలు దాడి చేశాయి. అకతాయిలు పాఠశాల పక్కన చెట్టుకు ఉన్న తేనెపట్టును రాయితో కొట్టడంలో తేనెటీగలు చెలరేగి ఒక్కసారిగా విద్యార్థులు, పాఠశాలలో పనిచేస్తున్న ఆయా బోళ్ల మంగమ్మపై దాడి చేశాయి. దాడిలో గాయపడిన వారిని 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక వైద్యం అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

సంపూర్ణ పారిశుధ్యం దిశగా గూడెం

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- కడకట్ల శివారులో రూ.32.14 కోట్ల వ్యయంతో ఎస్టీపీ నిర్మాణానికి శంకుస్థాపన



ఎస్టీపీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: దోమల రహిత తాడేపల్లిగూడెంను తీర్చిదిద్దడమే లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. కడకట్ల శివారున అమృత్ ఫేజ్–2 పథకంలో రూ.32.14 కోట్లతో నిర్మిస్తున్న 5 ఎంఎల్‌డీ సామర్థ్యం ఉన్న సేవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ) నిర్మాణానికి బుధవారం మంత్రి కొట్టు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కొట్టు మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఆయన సహకారంతో రాష్ట్రంలోనే మొదటి ఫేజ్‌గా తాడేపల్లిగూడెం భూగర్భ డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. అప్పట్లో రూ.30 కోట్లు వ్యయంతో మొదటి పట్టణంలో 50 శాతం నిర్మాణం పూర్తి చేశామన్నారు. అనంతరం వచ్చిన ప్రజాప్రతినిధులు భూగర్భ డ్రెయినేజీ నిర్మాణాన్ని పూర్తి చేయలేకపోయారన్నారు. తాను రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో పట్టణాన్ని వందల కోట్ల నిధులతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. 1వ పట్టణంలో 1, 2, 3 జోన్లుగా నిర్మిస్తున్నామన్నారు. పాతూరు, హౌసింగ్‌బోర్డు, కడకట్ల ప్రాంతాలలో ప్రత్యేక పంపింగ్ విభాగాలను నిర్మిస్తున్నామన్నారు. యూజీడీ ద్వారా ప్రతి గృహంలో వినియోగించిన మరుగు, మురుగు నీరు భూగర్భ డ్రెయినేజీ ద్వారా ఎస్టీపీకి చేరుతుందన్నారు. ఇక్కడ ఫిల్టరైజేషన్ చేస్తారన్నారు. పట్టణంలో ఐదు గ్రామాలు విలీనం కావడంతోపాటు, ఏపీ టిడ్కో 5,736 గృహాలు, 100 ఎకరాల్లో జగనన్న కాలనీల గృహాలకు అవసరమైన మరో ఎస్టీపీని నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అదేవిధంగా 2వ పట్టణంలో 4, 5, 6 జోన్లుగా రూ.100.20 కోట్లు నిధులతో ఎస్టీపీని నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. 2వ పట్టణంలో చిన్న తరహా ఎస్టీపీలను రెండు నిర్మిస్తున్నామన్నారు. మొత్తం రూ.144.53 కోట్లతో పట్టణంలో ఎస్టీపీల నిర్మాణం చేస్తున్నామన్నారు. అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా తాడేపల్లిగూడెంను నిలపాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.

మరో 40 ఏళ్లు మంచినీటి ఎద్దడి ఉండదు

పట్టణానికి రాబోయే 40 ఏళ్లపాటు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా మంచినీటి సరఫరా చేసేందుకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని మంత్రి కొట్టు వెల్లడించారు. అందులో భాగంగా పంపుల చెరువు ప్రాంతంలో రూ.4.8 కోట్లతో 11 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ఫిల్టర్ ప్లాంట్, రూ.31.64 కోట్లతో సెకండ్ సమ్మర్‌స్టోరేజ్ నిర్మాణం చేసేందుకు ప్రయత్నించామన్నారు. ప్రస్తుతం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నూతనంగా సీసీ లైన్స్ రూపొందిస్తున్నామన్నారు. ఇంజినీరింగ్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి అందిస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రూ.41.71 కోట్లను అమృత్ పథకంలో మంజూరు చేయించేందుకు కృషి చేస్తామన్నారు. ఇది పూర్తయిన అనంతరం జగనన్న కాలనీల్లో ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్లను ఏర్పాటు చేస్తామన్నారు. మంచినీటి సరఫరాకు మొత్తం రూ.71.53 కోట్లతో ఎస్ఎస్ ట్యాంకు, సీసీ లైనింగ్‌లకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజల కోరిక మేరకు పట్టణాభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్న తనను ఎవరూ అడ్డుకోలేరని ఉపముఖ్యమంత్రి కొట్టు అన్నారు. ఇక్కడి ఎస్టీపీ నిర్మాణాన్ని అడ్డుకునేందుకు కొందరు నాయకులు ప్రయత్నించారని, తనకు మంచిపేరు వస్తుందనే అక్కసుతోనే అభివృద్ధిని అడ్డుకుంటున్నారన్నారు. అభివృద్ధి అడ్డుకోవాలనుకుంటే ప్రజాద్రోహులుగా మిగిలిపోతారన్నారు.

దంతెవాడ ఘటనతో ఏజెన్సీ అలర్ట్

జంగారెడ్డిగూడెం: ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం బస్తర్ జిల్లా దంతెవాడలో పోలీసులను లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులు మందుపాతర పేల్చిన ఘటనలో 10 మంది పోలీసులు, ఒక డ్రైవర్, మొత్తం 11 మంది ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో ఏలూరు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలోని పోలీస్‌స్టేషన్‌లను జిల్లా ఉన్నతాధికారులు అప్రమత్తం చేశారు. దంతెవాడ అడవుల్లో మావోయిస్టులు ఉన్నారని నిఘావర్గాల సమాచారంతో డీఆర్‌జీ (డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్)లు ప్రత్యేక యాంటీ నక్సలైట్ ఆపరేషన్ చేపట్టారు. ఆపరేషన్‌ను ముగించుకుని మినీ వ్యాన్‌లో తిరిగి వస్తుండగా, మావోయిస్టులు ఐఈడీతో దాడి చేసి వ్యాన్‌ను పేల్చివేశారు. దీంతో ఏలూరు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలోకి మావోయిస్టులు ప్రవేశించే అవకాశం ఉందనే అనుమానంతో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రధానంగా పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో ఇప్పటికే ఉన్న సాయుధ బలగాలను అలర్ట్ చేశారు. నిఘా కూడా పెంచి ప్రాజెక్టుకు మరింత భద్రత కల్పించారు. పోలవరం సర్కిల్ పరిధిలో బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుకునూరు, వేలేరుపాడు పోలీస్‌స్టేషన్‌లను అప్రమత్తం చేశారు. అలాగే వాహనాలను, కొత్త వ్యక్తులను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు.

ప్రేమించి పెళ్లికి నిరాకరించాడని..

ఉరి వేసుకుని నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య



అయితంపూడిలో ఆత్మహత్య చేసుకున్న రాయి దివ్య

ఇరగవరం: ప్రేమించానని నమ్మించి గర్భం దాల్చిన తర్వాత పెళ్లికి నిరాకరించడంతో ఓ నర్సింగ్ విద్యార్థిని ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. తణుకు రూరల్ సీఐ ఆంజనేయులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయితంపూడి గ్రామానికి చెందిన రాయి దివ్య (20) ఉల్లంపర్రులో బీఎస్సీ నర్సింగ్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆమె ఇంటి సమీపంలో నివాసం ఉంటున్న కొమ్మర సతీష్ అనే యువకుడు ఏడాది నుంచి ఆమెను ప్రేమిస్తున్నానంటూ వెంటపడ్డాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో ఆమె ప్రస్తుతం నాలుగు నెలల గర్భిణి. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు సతీష్, అతడి కుటుంబసభ్యులను పెళ్లి కోసం నిలదీశారు. దీనికి సతీష్, అతడి కుటుంబసభ్యులు నిరాకరించి కాలయాపన చేస్తున్నారు. ఇదిలా ఉండగా తాను పెళ్లి చేసుకోనని, తన వల్ల గర్భం రాలేదని అనడంతో అవమానభారం భరించలేక మనస్తాపంతో దివ్య మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటిలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీనిపై పోలీసులకు సమాచారం రాగా సంఘటనా స్థలానికి వెళ్లిన ఎస్సై కె.చంద్రశేఖర్ మృతదేహాన్ని పంచనామా నిమిత్తం బుధవారం తణుకు ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి సోదరుడు రవితేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సతీష్, మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

● గడపగడపకు సంక్షేమం



పాలకోడేరు: కుముదవల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

నేటి నుంచి భీమవరంలో జాతీయ నాటిక పోటీలు

- తొలిరోజు సినీ సంగీత దర్శకుడు కోటికి సత్కారం
- ముఖ్య అతిథిగా హాజరుకానున్న నటుడు 'శుభలేఖ' సుధాకర్



భీమవరంలో నాటిక పోటీలకు సిద్ధమైన కళావేదిక

సాక్షి, భీమవరం: భీమవరం చైతన్యభారతి సంగీత నృత్య, నాటక పరిషత్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి నాటిక పోటీలు గురువారం ప్రారంభం కానున్నాయి. పట్టణంలోని డీఎన్నార్ కళాశాల ఆవరణలోని గన్నాబత్తుల క్రీడామైదానంలో నాటిక పోటీల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. నాటిక పోటీలను పద్మభూషణ్ కృష్ణ పేరున నిర్వహించనుండగా, ప్రారంభ కార్యక్రమంలో సినీ సంగీత దర్శకుడు సాలూరి కోటేశ్వరరావు (కోటి)ని ఆత్మీయ చైతన్య పురస్కారంతో సత్కరించనుండగా, సినీనటుడు శుభలేఖ సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అలాగే నాటక ప్రయోక్త నూతలపాటి సాంబయ్య, రంగస్థల, టీవీ, సినీ నటి కె.విజయలక్ష్మిలను సత్కరించనున్నారు. మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్, రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక సేవా సమితి చైర్‌పర్సన్ వంగపండు ఉష, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిళ్లంగోళ్ల శ్రీలక్ష్మి, ఎమ్మెల్యేలు గ్రంధి శ్రీనివాస్, మంతెన రామరాజు తదితరులు హాజరుకానున్నారు. అనంతరం ఉషోదయ కళానికేతన్ (కత్రపాడు) వారి 'పక్షాళన' నాటిక ప్రదర్శిస్తారని చైతన్య భారతి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాయప్రోలు భగవాన్, మంతెన రామకుమార్‌రాజు చెప్పారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం ఈనెల 25న చింతలపూడి మండలం చింతంపల్లికి చెందిన చిక్కాల వెంకమ్మ జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో తన కోడలు కాంచన కాన్పు నిమిత్తం తోడుగా మేనకోడలును వెంట తీసుకువచ్చింది. అయితే ఆసుపత్రి వద్ద రాత్రి సమయంలో నిద్ర రావడం లేదని బయటకు వెళ్లిన బాలిక తిరిగి రాలేదు. దీంతో వెంకమ్మ చుట్టుపక్కల, బంధువుల వద్ద వాకబు చేసిన ఫలితం లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మేరీపై దాడి ఘటన సీఎం దృష్టికి తీసుకెళతాం



విలేకర్ల సమావేశంలో బాధితురాలు మేరితో జీఐఎఫ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని రొక్కాల మేరిపై దాడి ఘటనపై న్యాయం జరగకపోతే సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకువెళతామని గ్లోబల్ ఇంటలెక్చువల్ ఫోరం (జీఐఎఫ్) సెక్రటరీ, రిటైర్డ్ అడిషినల్ డీజీపీ కూచిపూడి బాబూరావు చెప్పారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డు అతిథిగృహంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాలకొల్లు పదో వార్డులో నివాసం ఉంటున్న రొక్కాల మేరి ఎస్సీ సామాజిక వర్గానికి చెందినదని పక్క పోర్షన్‌లో అద్దెకు ఉంటున్న తల్లీ కుమార్తె చిన్నచూపు చూసేవారన్నారు. ఆమెను ఇంటి నుంచి ఏదోవిధంగా పంపించివేయాలని అనుకున్నారని, దీనిలో భాగంగా విద్యుత్ బిల్లు విషయంలో గొడవ పెట్టుకుని మేరిపై దాడి చేసి తీవ్రంగా కొట్టారన్నారు. మేరీ పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసును నిర్వీర్యం చేయడానికి ప్రయత్నించారని ఆరోపించారు. దీంతో ఎస్సీ, ఎస్టీ కుల సంఘాలు అండగా నిలవడంతో పోలీసులు సెక్షన్లు మార్చి కేసు నమోదు చేశారన్నారు. ఆమెకు సరైన న్యాయం జరగకపోతే ఎస్సీ, జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుల దృష్టికి తీసుకువెళతామన్నారు. రిటైర్డ్ ఎస్పీ ఏడి శిఖామణి, రిటైర్డ్ డీఎస్పీ సిహెచ్ పాపారావు, వి ప్రభుదాసు, రాజబాబు, శ్యామ్, ఆకుమర్తి సిన్హా తదితరులుపాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం

ద్వారకాతిరుమల: మారంపల్లి పంచాయతీ లక్ష్మీనగర్ వద్ద జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా శంఖవరం మండలం మండపం గ్రామానికి చెందిన ఆకేటి గోవిందు (19), అతని తల్లి రత్నం వ్యక్తిగత పనులపై బుధవారం ఉదయం స్కూటీపై విజయవాడ వెళుతున్నారు. లక్ష్మీనగర్ వద్దకు వచ్చేసరికి కుక్కలు అడ్డు రావడంతో అదుపుతప్పి స్కూటీ పైనుంచి కింద పడిపోయారు. ఆ సమయంలో పైకి లేస్తున్న గోవిందును నల్లజర్ల నుంచి భీమడోలు వైపు వెళుతున్న లారీ వెనుక నుంచి వేగంగా ఢీకొట్టి 20 మీటర్ల మేర ఈడ్చుకెళ్లింది. దీంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లి రత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

సబ్‌జైలుకు తరలిస్తుండగా

రిమాండ్ ఖైదీ పరారీ

గన్నవరం: పోలీసుల కళ్లుగప్పి సబ్‌జైలుకు తరలిస్తున్న రిమాండ్ ఖైదీ పరారైన ఘటనపై గన్నవరం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. గన్నవరం మండలంలోని కేసరపల్లి వద్ద ఇటీవల ఓ వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు అపహరించిన కేసులో ఘంటసాల మండలం శ్రీకాకుళానికి చెందిన గరికే సుబ్బారాజు అలియాస్ బ్లేడ్ స్థానిక సబ్‌జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. ఈ నేపథ్యంలో పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల పోలీస్‌స్టేషన్‌లో నమోదైన మరో కేసులో అతడిని పీటీ వారెంట్‌పై అక్కడి ఏఆర్ పోలీసులు మంగళవారం భీమవరం కోర్టుకు తీసుకువెళ్లారు. సుబ్బారాజును తిరిగి గన్నవరం సబ్‌జైలుకు తరలించే క్రమంలో ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ డి.నాగరాజుతో పాటు ఉన్న ఏఆర్ కానిస్టేబుల్ అనారోగ్య కారణాలతో ఏలూరులో ఆగిపోయాడు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో నిందితుడిని సబ్‌జైలు వద్దకు హెడ్‌కానిస్టేబుల్ తీసుకువచ్చారు. సబ్‌జైలు లోపలికి పంపించేందుకు మెయిన్ గేట్ వద్ద నిందితుడి చేతికి ఉన్న హ్యాండ్ కఫ్స్ తీయగానే హెడ్‌కానిస్టేబుల్‌ను తోసివేసి సుబ్బారాజు అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ప్రమాదంలో గాయపడిన హెడ్‌కానిస్టేబుల్ తేరుకుని పరిసరా ప్రాంతాల్లో గాలించినప్పటికి నిందితుడు దొరకలేదు. హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని పట్టుకునేందుకు మూడు బృందాలతో గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

కృష్ణాపురంలో మొక్కలు పంపిణీ



తాడేపల్లిగూడెం మండలం కృష్ణాపురం గ్రామంలో మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: జాతీయ సేవా పథకంలో భాగంగా శశి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఇంజనీరింగ్ విద్యార్థులు మండలంలోని కృష్ణాపురం గ్రామంలో మొక్కలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు పాల్గొని మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శశి ఇంజనీరింగ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు అభినందనీయం



వాసవి క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాసవి క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. వాసవి క్లబ్ సభ్యులు చెన్న రవి శంకర్ దంపతులచే బుధవారం స్థానిక ఎల్ఐసీ కార్యాలయం రోడ్డులో చలివేంద్రం, జూబ్లీ రోడ్డులో మానేపల్లి వెంకట రమేష్ దంపతుల సహకారంతో మరో చలివేంద్రం ఏర్పాటు చేశారు. వాసవి క్లబ్ జోన్ చైర్మన్ నున్న నాగలక్ష్మి, సుందరంలు ఈ చలివేంద్రాలను ప్రారంభించారు. శీమకుర్తి రాజ, పసుమర్తి అనిల్, మండ పవన్, వాసవి క్లబ్ డైరెక్టర్లు, సభ్యులు, ఆర్యవైశ్యులు మాట్లాడుతూ వేసవి దాహార్తుల కోసం ఆర్యవైశ్యులు మజ్జిగ, చల్లని మంచినీరు చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు, మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని కోరారు.

వృద్ధులను ఆదుకోవడం స్ఫూర్తిదాయకం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వృద్ధులను ఆదుకోవడం స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. పేరిచర్ల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మురళీకృష్ణంరాజు, లయన్స్‌క్లబ్, వశిష్ట క్లబ్‌లు ఆధ్వర్యంలో బుధవారం పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజన వితరణ గావించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ముదునూరి నితిన్ వర్మ, ఉమాదేవి, గగన్ శ్రీవర్మ, శివ రామరాజు, వెంకట రమణ రాజు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో జీఎస్ఆర్ పిప్పర విద్యా సంస్థల విజయకేతనం



నాగఫణీంద్ర, ద్వితీయ ఇంటర్ (980)

గణపవరం: బుధవారం రాత్రి వెల్లడించిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో జీఎస్ఆర్ పిప్పర విద్యాసంస్థలు విజయభేరి మోగించాయని కరస్పాండెంట్ సుధీర్‌కుమార్‌రాజు తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 90 శాతం, ద్వితీయ సంవత్సరంలో 92 శాతం ఫలితాలు వచ్చాయన్నారు. ద్వితీయ ఎంపీసీలో ఎం.నాగఫణీంద్ర 980 మార్కులు, టి.రామలక్ష్మి, సుమశ్రీదుర్గకు 967 మార్కులు వచ్చాయని, ద్వితీయ బైపీసీలో పావని సత్యకల్యాణి 957 మార్కులు, ప్రథమ సంవత్సరం ఎంపీసీలో నఫీషా 470మార్కులకు 457 మార్కులు సాధించారని తెలిపారు. గణపవరం చాణక్య జూనియర్‌కాలేజీ ఇంటర్ ఫలితాల్లో 91 శాతం సాధించినట్లు ప్రిన్సిపల్ అడపా సూరిబాబు తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో లోచన 969 మార్కులు, ప్రథమ సంవత్సరంలో 469 అత్యధిక మార్కులు సాధించినట్లు తెలిపారు.

నిరుపేదలకు చారిటీ బాక్సు సాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): సేవే పరమావధిగా చారిటీ బాక్సు పనిచేస్తుందని చారిటీ బాక్సు ప్రతినిధి కోదాటి వెంకటరావు పేర్కొన్నారు. చారిటీ బాక్సు ట్రస్ట్ సభ్యులు ఆధ్వర్యంలో పట్టణంలోని వెంకట్రామ థియేటర్ వద్ద బుధవారం పరదాల్లో నివాసం ఉంటున్న 20 కుటుంబాలు, సంచార జీవులకు నిత్యావసర వస్తువులు అందజేశారు. వెంకటరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ వంతుగా సేవ చేయాలని సూచించారు. అమలాపురంలో తమ సభ్యులు కొప్పుల భాస్కరరావు ఆధ్వర్యంలో నెలలో రెండు రోజులు అన్నదానం చేస్తున్నామని, అనేక జిల్లాల్లో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, ట్రస్టును విస్తరిస్తున్నట్లు వెల్లడించారు. ఆదర్శ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు రొక్కాల నాగబుజ్జి, రాష్ట్ర సగర కార్పొరేషన్ డైరెక్టర్ కర్నాటి కన్నయ్య తదితరులు మాట్లాడారు.

నేడు నిప్పులగుండం ప్రవేశం

ఉండి: పోలేరమ్మ, మహంకాళమ్మ, వెంకమ్మ, పోతురాజు ఆలయ 60వ వార్షికోత్సవ మహోత్సవాల్లో భాగంగా 27వ తేదీ గురువారం రాత్రి 8 గంటలకు ఉండిలో నిప్పుల గుండం ప్రవేశం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్, మాజీ సర్పంచ్ చిక్కాల సత్యజగదీష్ ప్రసాద్ తెలిపారు.

చకచకా రీ సర్వే

- జూలై రెండు నాటికి పూర్తి లక్ష్యం
- హక్కు పత్రాలే ఇక ఆధారం
- సమాచారం బేస్ స్టేషన్‌లో నిక్షిప్తం

తాడేపల్లిగూడెం: భూములకు పక్కా కొలతలు. సరైన సరిహద్దులు. క్రమబద్ధంగా సర్వే చేసి యజమానులకు అందచేసే హక్కుపత్రాలు. వివాదాలకు తావులేదు. ఆస్తులు ఏమైపోతాయేననే బెంగలేదు. ఎక్కడ కూర్చున్నా, తమ ఆస్తులు ఎలా ఉన్నాయో గూగుల్ ద్వారా కూడా చూసుకోవచ్చు. సుమారు వంద సంవత్సరాల తర్వాత వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం ద్వారా సాగే రీ సర్వే ద్వారా భూ యజమానులకు జరిగే ప్రయోజనాలు. ఈ ప్రక్రియకు రాష్ట్రంలో 2021లో మునిసిపాలిటీ ప్రాంతంలో నమూనా (పైలట్)గా గూడెం మునిసిపాలిటీని తీసుకున్నారు. ఐదు వార్డులలో సర్వే పూర్తి చేశారు. ఈ రీసర్వే రాష్ట్రంలో అన్ని పట్టణాలకు నమూనాగా మారింది. రీ సర్వేను వేగవంతం చేసే ప్రక్రియలో భాగంగా పట్టణంలో రీ సర్వే చకచకా సాగుతోంది. జులై రెండో తేదీ నాటికి మునిసిపాలిటీ పరిధిలో రీ సర్వేను పూర్తి చేసే క్రమంలో సర్వే శాఖ ఆధ్వర్యంలో మునిసిపల్ కమిషనర్ బి.బాలస్వామి పర్యవేక్షణలో , పట్టణ సర్వేయర్ రౌతు రామకృష్ణ ఆధ్వర్యంలో గ్రౌండ్ ట్రూతింగ్ జరుగుతోంది.

తొలిదశలో..

పైలట్ ప్రాజెక్టులో భాగంగా ఐదు వార్డుల్లో రీ సర్వేను విజయవంతంగా పూర్తి చేశారు. డ్రోన్ సర్వేకు ఉపముఖ్యమంత్రి, దేవదాయశాఖామంత్రి కొట్టు సత్యనారాయణ 2021 జులై 21న శ్రీకారం చుట్టారు. 3673 నివాసాల్లో 12,753 మంది జనాభాకు సంబంధించిన ఆస్తుల గురించి 24 బ్లాకుల్లో 2087 పట్టణ సర్వే నంబర్లలో 941.43 ఎకరాల్లో రీ సర్వే జరిగింది. హక్కు పత్రాలు అందచేయాల్సి ఉంది.

మలిదశలో..

రీ సర్వే ప్రక్రియను సులభతరం చేయడానికి వీలుగా వార్డు సచివాలయాలలో ప్రభుత్వం నియమించిన వార్డు ప్లానింగ్ రెగ్యులేషన్ కార్యదర్శులు (డబ్ల్యూపీఆర్ఎస్‌లు) సమన్వయంతో సర్వే అధికారులు పట్టణంలో రీ సర్వేను వేగవంతం చేశారు. గ్రౌండ్ ట్రూతింగ్ చేస్తున్నారు. 35 వార్డులు, 138 బ్లాకులు, 12,653 సర్వే నంబర్లల్లో 5899.30 ఎకరాల్లో పైలట్ ప్రాజెక్టు రీ సర్వేగా చేసింది మినహా మిగిలిన జనావాసాలలో, గృహాలు, ఖాళీ స్థలాలు, వ్యవసాయ క్షేత్రాలు విస్తీర్ణాలను తేలుస్తున్నారు. ఈ ప్రక్రియ జులై రెండోతేదీ నాటికి పూర్తి చేసి, హక్కు పత్రాలను అందచేసే ఆలోచనలో అధికారులు ఉన్నారు. రీ సర్వే ద్వారా సేకరించిన సమాచారం మొత్తం బేస్‌స్టేషన్‌కు చేరి అక్కడ భద్రంగా ఉంటుంది. సమగ్ర సమాచారంతో హక్కు పత్రాలను అందించేందుకు జరుగుతున్న సర్వేను విజయవంతం చేయాలని కోరుతున్నారు.



గూడెం పట్టణంలో గొల్లగూడెం ప్రాంతంలో గ్రౌండ్ ట్రూతింగ్



సమాచారం చేరే బేస్‌స్టేషన్

జగనన్నే మా భవిష్యత్తుకు అపూర్వ స్పందన



విప్పర్రు గ్రామంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న యువనేత కొట్టు విశాల్, గ్రామ పార్టీ నాయకులు

పెంటపాడు: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి అపూర్వ స్పందన వస్తోందని యువనేత కొట్టు విశాల్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం పడమరవిప్పర్రు గ్రామంలో గ్రామ పార్టీ శ్రేణులు చేపట్టిన జగనన్నే మాభవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని గ్రామ పార్టీ నాయకులతో పాటు, పలు వార్డుల్లో ఇంటింటికి తిరిగారు. పథకాలను వివరించారు. ఈ సందర్భంగా విశాల్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో జగనన్న మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రజల పాదయాత్రలో ఆయన ఇచ్చిన హామీలతో పాటు, ప్రజలు ఊహించని పథకాలు అందించి ప్రతి కుటుంబంలో ఆయన వెలుగులు నింపారన్నారు. రాబోయే రోజుల్లో పార్టీని ప్రతి ఒక్కరూ ఆదరించాలని పేర్కొన్నారు. ప్రజల కోసం ఎంతో కష్టపడుతున్న జగనన్నను, ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను మరో మారు ఆదరించాలన్నారు. దీనికి పార్టీ కార్యకర్తలు, ప్రజలు సంసిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ పసల చంటి, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు, గ్రామ పార్టీ శ్రేణులైన బోణం వీరయ్య, సర్పంచ్ తెంటు జయలక్ష్మి, తెంటు గోపి, శ్యాం కుమార్, నంగిరెడ్డి రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు యండ సరస్వతి, కోడూరి నరసింహరావు, చినిమిల్లి వెంకయ్య, కశిరెడ్డి అబ్బాయి, రాగు పద్మనాభం, సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

అమృత్ సరోవర్ పనులు త్వరగా పూర్తి చేయాలి



ఉనికిలిలో ఉపాధి హామీ పనులను తనిఖీచేస్తున్న పీడీ రాజేశ్వరరావు

అత్తిలి: ఉనికిలి గ్రామంలో జరుగుతున్న అమృత్ సరోవర్ మంచినీటి చెరువు తవ్వకం పనులను జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్టీవీ రాజేశ్వరరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు తవ్వకం పనులను ఈనెలాఖరునాటికి పూర్తి చేయాలని ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందిని ఆదేశించారు. చెరువులో సిమెంట్ తూములు ఏర్పాటు చేసేందుకు బడ్జెట్ ప్రణాళిక సిద్ధం చేయాలని టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. వేసవికాలం దృష్ట్యా శాశ్వత మజ్జిక కేంద్రాన్ని పీడీ రాజేశ్వరరావు ప్రారంభించారు. గ్రామంలో ఉన్న అన్ని గ్రూపులకు ప్రథమ చికిత్స కిట్‌లను అందజేశారు. కూలీలు పనిప్రదేశంలో గాయపడితే ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యంకోసం ఆసుపత్రికి తీసుకువెళ్లాలని మేట్‌లకు సూచించారు. ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు మాట్లాడుతూ అటెండెన్స్‌పై మేట్‌లకు అవగాహన కల్గిఉండాలని, హాజరు విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సర్పంచ్ వట్టికూటి అనంతలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు సూర్యనారాయణ, కార్యదర్శి ఫణిరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ శాంతి స్వరూప్, నవ్యలత, పాల్గొన్నారు.

దివ్యాంగుల క్రికెట్ టోర్నమెంట్ గోడపత్రిక ఆవిష్కరణ



తణుకులో దివ్యాంగుల క్రికెట్ టోర్నమెంట్ గోడపత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: అంతర్‌జిల్లా దివ్యాంగుల క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు సత్తా చాటాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆకాంక్షించారు. ఆంధ్ర క్రికెట్ ఫెడరేషన్ ఫర్ డిజబుల్డ్ ఆధ్వర్యంలో వచ్చేనెల 26 నుంచి 28 వరకు నిర్వహించనున్న కారుమూరి దివ్యాంగ్ ప్రీమియర్ లీగ్ గోడపత్రికను బుధవారం మంత్రి కారుమూరి ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. భీమవరం డీఎన్నార్ కళాశాల క్రీడాప్రాంగణంలో ఈ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు కార్యదర్శి యడ్లపల్లి సూర్యనారాయణ తెలిపారు. సంస్థ గౌరవాధ్యక్షుడిగా ఉన్న మంత్రి కారుమూరి గత 18 ఏళ్లుగా ఆంధ్ర దివ్యాంగుల క్రికెట్ జట్టుకు అండగా నిలబడ్డారని స్పష్టం చేశారు. సంస్థ వ్యవస్థాపకుడు జీఆర్ఎల్ సూర్యనారాయణ రాజు, కోశాధికారి కొండా సత్యవరప్రసాద్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



యాక్సిస్ బ్యాంకు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్: స్థానిక యాక్సిస్ బ్యాంకు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఉచితంగా కంటిపరీక్షలు, బిపి, షుగరు తదితర వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందచేశారు. మేక్సీవిజన్, అపోలో, శంకర్ నేత్రా లయం వంటి ప్రముఖ ఆసుపత్రుల వైద్యులు వైద్య సేవలను అందించారు. యాక్సిస్ బ్యాంక్ మేనేజరు బి శ్రీనివాసరావు మాట్లాడుతూ బ్యాకింగ్ వ్యవస్థలో తమ యాక్సిస్‌బ్యాంకు దేశంలోనే 3వస్థానంలో నిలిచిందన్నారు. సామాజిక బాధ్యతగా తమ యాక్సిస్ బ్యాంకు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సాయిబాబా ఆలయంలో విశేష పూజలు

సాక్షి, భీమవరం: భీమవరం హౌసింగ్ బోర్డ్ కాలనీలోని వెంకట సాయిబాబా ఆలయ 12వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం బాబాకు మెంటే పార్థసారధి, వసంత విజయలక్ష్మి దంపతులు అష్టోత్తర కలశారాధన, కలశాభిషేకం, గోక్షీరాభిషేకం నిర్వహించారు. ఆలయ చైర్మన్ మల్లినీడి తిరుమలరావు (బాబి) ఆధ్వర్యంలో హోమాలు, ద్వాదశ జ్యోతిర్లింగార్చన చేశారు. తిరుమల సుధాకర్, కాకులపాటి భానుమూర్తి, సీతామహాలక్ష్మి, గంధం వెంకటేశ్వరరావు, ధనలక్ష్మి పాల్గొన్నారు.

28 నుంచి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న నిర్వాహకులు

కాళ్ల: డాక్టర్ దంతులూరి విజయరామరాజు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించినట్లు నిర్వాహకులు ఇందుకూరి ప్రసాద్ రాజు పెనుమత్స విశ్వనాథరాజు తెలిపారు. కోపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించాలని ఆలోచనతో ప్రముఖ వైద్యులు దంతులూరు విజయరామరాజు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని ఆరు జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారని అన్నారు. విజయనగరం, విశాఖ స్టీల్ ప్లాంట్, వెస్ట్ గోదావరి, ఎస్బీఆర్ ఫౌండేషన్, శ్రీకాకుళం కృష్ణ జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నానున్నట్లు వారు స్పష్టం చేశారు. క్రీడాకారులకు అలవెన్సులు, భోజన వసతులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రోత్సాహంగా ప్రథమ బహుమతి రూ.30 వేలు, ద్వితీయస్థానానికి రూ.25 వేలు, తృతీయ స్థానానికి రూ.20 వేలు అందిస్తామన్నారు. పోటీలు కాళ్ల మండలం కోపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించినట్లు స్పష్టం చేశారు.30వ తేదీన ముగింపు రోజున విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారని నిర్వాహకులు తెలిపారు. జిల్లా వాలీబాల్ కార్యదర్శి పవన్ కుమార్ వర్మ, నిర్వాహకులు, కమిటీ సభ్యులు పి. ప్రభాకర్ రాజు, డి.శివాజీ రాజు, జయవర్మలు పాల్గొన్నారు.

నాడు గుడిసెలు-నేడు భవనాలు



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో భవనాలు నిర్మించి యిచ్చినట్లు చూపిస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: గత ప్రభుత్వం పేదలు సొంత గృహాలు నిర్మించుకొనేందుకు ఎదురుచూపులు చూసేవారని అనాడు గుడిసెలే దిక్కు అన్నట్లు బలహీన వర్గాలు జీవించేవని ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఎద్దేవా చేశారు. ఎస్టీపీ శంకుస్థాపన అనంతరం ఆయన సమీపంలో ఉన్న యానాదుల కాలనీని బుధవారం సందర్శించారు. ఏళ్ల తరబడి గుడిసెల్లో నివాసం ఉంటున్న 27 యానాదుల కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన నిధులతో భవనాలను నిర్మించారు. దీంతో వారు ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ నాడు గుడిసెలే దిక్కు అని భావించిన యానాదులు కుటుంబాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో నేడు భవనాలను నిర్మించి పంపిణీ చేస్తున్నామన్నారు. గతంలో ఒక్క కరెంటు పోలును ఏర్పాటు చేసి వీధి లైట్లు ఒక్కటి ఏర్పాటు చేయమని తనను ప్రాధేయపడిన సంఘటన మరువలేదన్నారు. తాను ప్రతి కుటుంబానికి గృహాన్ని నిర్మించి అందచేస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చామన్నారు. ఇప్పుడు విద్యుత్ పోల్స్‌ను ఏర్పాటు చేసి ప్రతి భవనానికి విద్యుత్ కనెక్షన్లు అందించామన్నారు. వీటితోపాటు వీధిలైట్లు ఏర్పాటు చేసి ఆ ప్రాంతంలో రోడ్డును నిర్మించేందుకు రూ.5 లక్షల మంజూరు చేశామన్నారు. గతంలో రోడ్లు, వీధి దీపాలు లేక పాములు సంచరిస్తున్నాయనే భయంతో జీవించేవారన్నరు. ఇప్పుడు జగన్ ప్రభుత్వంలో వారికి నూతనంగా భవనాలు నిర్మించిన అందచేయడం ఆనందంగా ఉందన్నారు. చిత్తశుద్ధి కలిగిన నాయకుడు ఉంటే ప్రతి ఒక్కరూ సంక్షేమంతో సంతోషంగా జీవిస్తారన్నారు. ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని ఉదాహరణగా యానాదులకు నిర్మించిన ఇచ్చిన భవనాలు నిదర్శనమన్నారు. ఏ కార్యక్రమం చేపట్టినా ఇతరులకు ఇబ్బందులు ఎదుర్కొకూడదనే ఉద్దేశ్యంతో ఉంటానన్నారు. తాడేపల్లిగూడెంలో ఉన్న రెండు ప్రతిపక్షాలు దుశ్చర్యలు చేయడానికి కలిసి పనిచేస్తున్నాయన్నారు. యానాదుల వారి కుటుంబాలతో సంతోషంగా ఉండటం తనకు ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యానాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఏడుకొండలు, నాయకులు కొలుకులూరి ధర్మరాజు, కర్రి భాస్కరరావు, ముప్పిడి సంపత్‌కుమార్, కొట్టు విశాల్, నీలం భూషణం, మారిశెట్టి రమణ, పొట్లపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయలకు కృషి



చింతపల్లి జగనన్న కాలనీలో నూతనంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన దృశ్యం

పెంటపాడు: జగనన్న కాలనీల్లో మౌలికసదుపాయల కల్పించడంతో అధికారుల కృషి అభినందనీయమని పార్టీ నాయకులు దాట్ల రామలింగ రాజు, పేరిచర్ల కిరణ్‌రాజులు పేర్కొన్నారు. జగనన్న కాలనీలో విద్యుత్ శాఖ డీఈ చంద్రశేఖర్, ఎ. సతీష్, ఏఈ పద్దరాజు తదితరులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు. విద్యుత్ శాఖ ద్వారా తమ గ్రామానికి విద్యుత్ అందించిన సందర్భంగా స్థానిక పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

తాడేపల్లిగూడెం (టీఓసీ): గూడెం ఆర్టీసీ డిపో పరిధిలో 27న డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణమూర్తి తెలిపారు. ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు నిర్వహించనున్న కార్యక్రమానికి సలహాలు, సూచనలను ఫోన్ 9959225488కు చేసి డిపో అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ప్రథమ చికిత్స కిట్ల అందజేత



ఫస్ట్ ఎయిడ్ కిట్‌లు అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అత్యవసర సమయాల్లో ప్రథమ చికిత్స కిట్లు ఎంతో ఉపయోగపడతాయని డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణమూర్తి అన్నారు. పట్టణంలోని యూనియన్ ఆస్పత్రి వారి ఆర్థిక సహకారంతో అందించిన కిట్లను బుధవారం కండక్టర్లకు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్స్ డాక్టర్లు టి.కల్యాణ్ చక్రవర్తి, కె.జయకృష్ణ, బి.శ్రీకాంత్, ఎస్.రజిత కుమారి, పి.చందు, వి.జీవన్‌బాబులు హాజరైయారు. డిపో సూపర్‌వైజర్లు, కండక్టర్లు, డ్రైవర్లు, గ్యారేజీ సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన రాజమండ్రి ఆనం కళా మందిరంలో ఉద్యోగుల సమస్యలపై కార్యాచరణ ప్రణాళిక సమావేశం , బహిరంగ సభ జరుగుతుందని, మద్దతుగా ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం పాల్గొంటుందని, విజయవంతం చేయాలని జిల్లా నాయకులు నల్లా అప్పారావు, గోవింద్‌రావు, యం.రత్నరాజు, నామాల రాజు, కాపా నాగరాజు, ఎన్.ప్రసాద్ బాబు, కె.రామకృష్ణలు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర నాయకులు జి.ఆస్కార్ పాల్గొంటారని వివరించారు.

కోడిపందాల శిబిరంపై పోలీసుల దాడి

తాడేపల్లిగూడెం రూరల్: కోడిపందాల శిబిరంపై దాడి చేసి, ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్టు రూరల్ ఎస్సై వీఎస్.వీరభద్రరావు తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కృష్ణాయపాలెం గ్రామంలో కోడిపందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు బుధవారం ఉదయం రూరల్ పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.7600లు నగదు, నాలుగు కోడిపుంజులు, నాలుగు కోడికత్తులు, నాలుగు సెల్ ఫోన్లు, 11 మోటారు సైకిళ్లు సీజ్ చేసినట్లు రూరల్ ఎస్సై వీరభద్రరావు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు

- ఆదమరిస్తే అంతే సంగతులు
- హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలంటున్న వాహనదారులు



తణుకు వెళ్లే దారిలో ప్రమాదకరంగా ఉన్న మలుపులు



భీమవరం ఆర్అండ్‌బీ రహదారిపై ప్రమాదకరంగా ఉన్న మలుపులు

అత్తిలి: భీమవరం నుంచి తణుకు వెళ్లే రహదారిలో పలుచోట్ల రహదారులపై ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా తయారయ్యాయి. కొరుకల్లు నుంచి అత్తిలి, ఇరగవరం, తణుకు వైపు వెళ్లే రహదారులపై కొన్నిచోట్ల ఎల్ ఆకారంలో, మరికొన్నిచోట్ల జెడ్, ఎస్ ఆకారంలో మలుపులు ఉన్నాయి. నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రహదారులపై మలుపుల వద్ద రోజూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కొందరు త్రుటిలో బయట పడిన సందర్భాలనేకం. అత్తిలి-ఇరగవరం రహదారిలో సెంటర్‌కు అతి సమీపంలో బండిరేవు వద్ద ఎల్ ఆకారంలో ఉన్న మలుపులో ఎదురుగా వచ్చే వాహనాలు సమీపంలోకి వస్తే తప్ప కనిపించవు. ఇక్కడ వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తారు. తణుకు వైపు వెళ్లే వాహనాలు, భీమవరం వైపు నుంచి వచ్చే వాహనాలు ఒకేసారి మలుపు వద్ద ఎదురెదురుగా వచ్చినప్పుడు తప్పకోవడం ఆటోలకు, మోటార్ సైకిలిస్టులకు గగనంగా ఉంటుంది. భీమవరం వైపు వెళ్లే రహదారిలో పలు మలుపులు ఉన్న ఎల్ ఆకారపు మలుపులలో ఎదురుగా వచ్చే వాహనాలు సమీపంలోకి వస్తే తప్ప కనిపించవు. పుంత మునసలమ్మ గుడివద్ద ఉన్న మలుపులు ప్రమాదభరితంగా ఉన్నాయి. మందలపర్రు వంతెన మలుపు గమనించక ఇటీవలే ఒకలారీ, మరో టాక్సీ మలుపు వద్ద కాల్వలోకి దూసుకుపోయాయి. ఊరిబయట మలుపుల్లో తుప్పలు, పిచ్చిమొక్కలు పెరిగిపోవడం వల్ల ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. ఇలాంటి మలుపుల వద్ద అధికారులు హెచ్చరిక బోర్డులు, వేగ నియంత్రణలు, మార్గ సూచికలు ఏర్పాటుచేస్తే కొంతైనా ఫలితం ఉంటుందని వాహనదారులు కోరుతున్నారు.